# దుర్గ

**ముగ్గురికీ** తనే వంట చేసింది దుర్గ. గుడ్లుపొరటు, అన్నం, చారు, పెరుగు. ఒక అరడజను అప్పడాలు. "సచ్ నైస్ స్మెల్" అంది డెల్గా. వంట బాగాచేస్తుందంది కిశోరి. అప్పడాల మీద మూత పెట్టి ఒచ్చి కుర్చీలో కూచుంది దుర్గ. ఉదయం పన్నెండు దాటింది. పక్కనే టేబిలు మీదున్న తన టీ కప్పు అందుకుందామె. పక్క కుర్చీలో డెల్గా ముందుకు జారి రెండుకాళ్లూ కిశోరీ మంచం మీద పెట్టింది. ఒకే అని వదిలేసిన కథ మొదలు పెట్టిందామె. డెల్గా జర్మన్, ముంబైలో పెద్ద ఎన్‌జీవోలో పనిచేస్తోంది. రెండు నెలల్లో ఆమె వీసాతో పాటు డిసర్టేషన్ కూడా అయిపోతుంది. ముంబై వాతావరణానికి రెండో రోజే అలవాటుపడిందామె. పదోరోజు ముక్కుకుట్టించుకుంది. గోధుమరంగు పెద్ద కళ్లూ, కొంచెం బొద్దుగా పొడుగ్గా డెల్గా అందం ఆమె నవ్వినప్పుడు తళుక్కుమంటుంది. తల వెనక్కివాల్చి మనసులోంచి నవ్వగలదు డెల్గా. ఆమె పనిచేస్తున్న గ్రామంలో నాగరిక సమాజానికి రెండ్రోజుల కాలక్షేపానికి పనికొచ్చే గొడవ జరిగింది.

"ఇష్టం లేనిదాని వెంట పడ్డం ఎందుకు? పైగా రేప్ చెయ్యడం తప్పు కాదా?" అంది దుర్గ

"తప్పే కానీ వాడి  ఉద్దేశం మంచిది. దేర్ ఈజ్ ఎ కన్‌ఫ్యూజన్ ఆఫ్ వాల్యూస్" అంది డెల్గా.

"ఆమె వాడికి వదిన అని మర్చిపోతున్నాం."

"భర్తపోయిన వదినగార్ని చేసుకునే ఆచారం ఉందక్కడ" అంది డెల్గా. ముంబై నగర పాదం మీద పుట్టుమచ్చలాగ ఒక గ్రామం పెరిగింది. టార్పాలిన్ షీట్లు, బంగాళా పెంకు, ఎక్కువ భాగం రేకులతో ఇళ్లలాంటి షెడ్లలో అన్ని రాష్ట్రాల నిర్వాసితులూ ఉన్నారక్కడ. కాకుల గూళ్లలాంటి గ్రామంలో ఒక బీహారీ కుటుంబంలో గొడవ జరిగింది. తల్లీ తండ్రీ ఇద్దరు కొడుకులూ ఒక కోడలూ ఒక మనవడూ ఉన్న కొంప అది. వాళ్లందరూ ఒకేసారి ఇంట్లో ఉండడం సులభం కాకపోయినా చిరునామా అదే. ఏడాది క్రితం పెద్దకొడుకు కాలుజారి రైలు కింద పడి అక్కడికక్కడే రెండు ముక్కలైపోయాడు. లోకల్‌రైల్లో సంత్రాలు అమ్ముతూ తొక్కిడిలో కాలుజారి పడిపోయాడతను. చిన్న కొడుకు షెడ్డులో మెకానిక్. కుటుంబానికి శవం ముక్కలు దొరికేటప్పటికి మరో రెండు రోజులూ అయిదు

వందల రూపాయలూ అయ్యేయి. బతకడం కోసం ఏడవడం మానేసి కొద్ది రోజుల్లో కోడలు మామూలయిపోయింది. కొద్ది రోజుల క్రితం అందరూ కలిసి మరిదితో పెళ్లి నిశ్చయించారు. ఆమె ఒప్పుకోలేదు. ఆ రాష్ట్రంలో లేకపోయినా గంగలో దూకుతానంది. ముందు చెప్పి చూసి తరవాత ఒళ్లు మండి మావగారు దవడ పగలకొట్టేడు. చిన్న కోడలు ఒస్తే జాగాతో సహా ఒచ్చే ఇబ్బందుల్ని, కొడుక్కి ఆమెకీ దొరికే రక్షణ గురించి అత్తగారు తిట్లతో వివరించింది. మరిది ఏం మాట్లాడలేదు. వారం క్రితం ఓ తెల్లవారు జామున ఇంటి కొచ్చి వదినగారి నోరునొక్కి మానభంగం చేశాడతను. రోజుకీ రోజుకీ తేడా లేకుండా పోయిన బస్తీలో ఓ పూటంతా పంచాయితీ లాంటిది జరిగింది. మరిది నే చేసుకుంటానన్నాడు.

"ఆమెని ఒప్పించే మార్గం లేక రేప్ చేశాడు నిజానికి" అంది డెల్గా. ఇది విలువలకి సంబంధించిన ప్రశ్నకా దంటుందామె. సౌతిండియన్‌వి గదా నువ్వేవంటా వందామె.

"నాకేం నచ్చినట్టులే"దందామె.

"ఐ థింక్ ఇట్ ఈజ్ ఓకే." అంది కిశోరి.

మొత్తం కథంతా డైరీలో రాసుకుంది డెల్గా. బిహారీల ఫొటోలు తీసుకుంది. లేచి హేండ్ బేగ్ లోంచి ఫోటోలు తీసి చూపించింది. ఒకళ్ల తరవాత ఒకరు బిహారీలతో ముఖ పరిచయం చేసుకున్నారు.

"షి ఈజ్ సెక్సీ" అంది కిశోరి.

మళ్లీ ఫోటోలు బేగ్‌లో పెట్టుకుని కాళ్లు మంచం మీదికి బారచాపి కూచుంది డెల్గా. కప్పు ఖాళీ చేసి సింకులో పెట్టి వచ్చి నుంచుంది దుర్గ.

"ఓహ్ మై బ్యాక్" అంటూ లేచింది డెల్గా.

ఇలారా అని ఇరుకు మంచంలోనే జరిగి చోటిచ్చింది కిశోరి. వన్‌సెక్ అంటూ దుర్గ డెల్గా నడుం మృదువుగా నాలుగైదు సార్లు రుద్దింది. బాగుందంది డెల్గా. "నేను స్నానం చేసొచ్చి మళ్లీ మసాజ్ చేస్తాను. అప్పుడు దబ్బు లిద్దువుగాని" అంది దుర్గ. సొంత చేతుల్తో వీపు రుద్దకోడానికి వీల్లేని స్నానాల గది. తలుపు వెనక బట్టలు తగిలించి చల్లటి నీళ్లు ఒంటిమీద కుమ్మరించు కుంది దుర్గ.

సాంగ్లీ నుంచి ఒచ్చిన మరాఠీ అమ్మాయి కిశోరి. ఆమె కూడా ఒక పెద్ద ఎంఎన్‌సికి చెందిన కాల్‌సెంటర్లో పనిచేస్తోంది. పదో అంతస్తులో పనిచేసే దుర్గతో ఒకరోజు లిఫ్ట్‌లో పరిచయం అయింది. స్నేహం కూడా ముదిరి ఇద్దరూ ఒక గదిలోకి మారేరు. ఓ గుజరాతీ స్వీట్ల వ్యాపారి మేడ మీది గది. మూసిన పుస్తకంలా ఇద్దరూ సద్దుకుంటున్నా రా గదిలో.

కొన్ని విషయాల్లో పోలికలేకపోయినా ఇద్దరికే నిజమైన స్నేహం ఏర్పడింది. కిశోరి దుర్గ కంటే ఏడాది పెద్దది ("అంటే నీ కంటే ఏడాది ముందు పెద్దమనిషి నయ్యాను") చిన్నప్పట్నించీ ఆమెలో కొంచెం ముంబై ఉండడంతో ఈ మహానగరంలో ఒంటరితనం కష్టం అనిపించలేదు కిశోరికి. అసలు విజయవాడ నుంచి ముంబై రావడమే కష్టం అయింది దుర్గకి. మహానగరం అడవిలా తోచిందామెకి. ఏహాదో రెండేళ్లో పనిచేసి పెళ్లికాగానే నగరం వదిలేద్దావనుకుందామె. అయిదేళ్ల తరవాత దుర్గ ముంబైలో కలిసిపోయింది. నాలుగైదు రోజులు ఇంటికి వెళ్లినా మూడోరోజు నుంచీ ఆమె కేవీ తోచేది కాదు. స్నేహితురాళ్లందరికీ పెళ్లిళ్లయి పోయేయి. ఈ అయిదేళ్లలో పెళ్లి కాలేదనే బెంగా అయితే బాగుండుననే ఆలోచనా ఆమె నొదిలేశాయి. ఈ మహానగరంలో మగవాళ్లు రోజూ సాయంత్రంలోగా తన కూతుర్లాంటి కనీసం నలుగురమ్మాయిల్ని మానభంగం చేసి తీరతారనే నమ్మకం ఆమె తల్లిది. కొంపదీసి అటువంటి దేవీ జరగలేదు గదా అని బెంగపడుతూంటుందామె.

విజయవాడ ఒకసారి వచ్చినప్పుడు బలవంతంగా ఒక పెళ్లి చూపులకి ఒప్పించారు. అందరు భారతీయ యువకుల్లాగే అతను కూడా సాఫ్ట్‌వేరు ఇంజనీరు. బెంగుళూర్లో ఉద్యోగం. ముందు అమెరికా వెళ్లి వచ్చి ఆ డబ్బుతో కన్సల్టెన్సీ పెడతానన్నాడు. పెళ్లి చేసుకుని మరీ వెళ్లమని ఆంక్ష విధించింది తల్లి. పైగా ఆరోగ్యవంతురాలు కాదు. దుర్గ అతన్ని చేసుకుని ఉద్యోగం ఒదిలేసి విజయవాడలోనే ఏదో ఉద్యోగం చేసుకుంటూ అత్త మామలకు సేవ చేస్తూ భర్తకోసం ఎదురు చూస్తూండాలి. అతను చటుక్కున మూడేళ్లలో ఒచ్చేస్తాడు. నీలం పేంటూ, తెల్ల చొక్కాలో అతని కామె కంప్యూటర్లా కనిపించాడు. ఆమె అదృష్టం బాగుంది. కనకదుర్గమ్మతల్లి అతన్ని తాత్కాలికంగా ఆవహించి "మేం ఇద్దరం విడిగా ఒకసారి మాట్లాడుకుంటాం" అన్నాడు.

కృష్ణా బ్యారేజ్ మీద నుంచున్నారిద్దరూ. ఎండి నిర్జీవమైపోయిన కృష్ణమ్మ దుర్గ గుడి దగ్గిర అడుక్కునే ముసిల్దానిలా ఉంది. సంభాషణ ఇంగ్లీషులో మొదలుపెట్టిందామె. అతనికి కొంచెం ఇబ్బందిగా ఉంది. ఆమె జీతం గురించీ జీవితం గురించీ ఖర్చుల గురించీ యధాలాపంగా అడిగేడతను.

"అటువేపు వెళ్లి కూచుని బీరు తాగితే బాగుంటుంది కదూ?" అందామె. అంతవరకూ ప్రశాంతంగా ఉన్న సాయంకాలం అతని కళ్ల ముందు భళ్లుమంది. మరో నిముషం ఆగి తీరిగ్గా, హేండ్‌బేగ్‌లో దాచిన సిగరెట్ వెలిగించింది దుర్గ. అతను కంగారుగా అటూ ఇటూ చూశాడు. సాధ్యమైనంత వరకూ ఆమె కద్దునుంచోడానికి ప్రయత్నిస్తున్నాడతను. "ఐ మిస్ ముంబై వెరీ మచ్" అందామె. దుర్గ అనుకున్నట్టుగానే జరిగింది. వరుదు మళ్లీ

గవర్నర్‌పేట వైపు రాలేదు. అంతా విని పగలబడి నవ్వింది కిశోరి. కానీ ఆ రాత్రి చాలా ఆలోచించింది. తనకి ఏం కావాలి? పెళ్లి అవసరం లేదా? ఇంటికి దూరం అయి పోయిందా? సరి అయిన సమాధానం దొరక లేదు. తలిదండ్రుల మీద ఆపేక్ష తగ్గలేదు. ప్రతీవారం ఇంటికి ఉత్తరం రాయడం, ఫోన్ చెయ్యడం మానలేదు. కానీ ఒకటి స్పష్టంగా అర్థమైందామెకి. తన సమాధానాలు తనే వెదుక్కుంటుంది. ఈలోగా చురీదార్ కింద వేసుకునే ఆమె అండర్‌వేర్‌లాగా ఒక ఆత్మీయ స్పర్శ అయిపోయింది ముంబై.

మెళ్లో తువాలు వేసుకుని తలుపు తోసుకు లోపలికి వచ్చింది దుర్గ. కిశోరీ ఏదో మాట్లాడుతోంది. డెల్లా ఆమె పక్కనే పడుకుంది. ఆమె చేతి వేళ్లు కిశోరీ దేహాన్ని ఇష్టంగా పలకరిస్తున్నాయి.

“అయిందా?” అంది దుర్గ.

“షి ఈజ్ రేపింగ్ మి” అంది కిశోరీ.

“నీ వ్యవహారం చూస్తే అలా అనిపించడం లేదు” ముగ్గురూ నవ్వేరు. తువాలు ఆరేసి కూచుంది దుర్గ. “నే వెళ్లి బీరు తెస్తా”నంది కిశోరి. గబగబ లేచి కిందికి దిగి వెళ్లిందామె. సేటు భార్య పిల్లల్ని నిద్రపుచ్చడానికి పాట పాడుతోంది. పిల్లలు పడుకోవడానికి కారణం పాటేనని తెలీ దామెకి. ఆమె నెప్పుడు చూసినా ఏదో స్వీట్‌తో చేసినట్టుండి దగ్గిరి కొస్తే నెయ్యి వాసన. గుమ్మం దగ్గిర నుంచుని “భాబీజీ” అంది కిశోరి. పాట ఆపి ఆమె లేచి ఫ్రిజ్‌లోంచి మూడు బీరు సీసాలు తీసి ఇస్తూ “ఠండా హైనా?” అందామె. సమాధానంగా నవ్వుతూ ఆమె నేతి చేతిలో పది రూపాయలు పెట్టింది కిశోరి. ఎప్పుడు బీరు సీసాలు పెట్టినా పది రూపాయల ఒప్పందం. కానీ అపుడప్పుడు ఇద్దరికీ స్వీట్లు కూడా పంపిస్తూంటుంది.

ముగ్గురూ సీసాలు ఎత్తి రెండు పెద్ద గుక్కలు తాగి అప్పడాలు అందుకున్నారు. రాజకీయాలు, సేటుగారి సెక్సు జీవితం, డెల్లా డిసర్టేషన్ వగైరాలు కలుపుకుంటూ నంజుకుంటూ భోజనం ముగించేసరికి దరిదాపు మూడైంది. భోజనం అయి అరగంట కాగానే డెల్లా వెళ్లి పోయింది. మాట్లాడుతూనే నిద్రపోయింది దుర్గ. ఆమె వేపు చూస్తూండి పోయింది కిశోరి. చాలా మందికీ దుర్గకీ చెప్పలేని ఏదో తేడా. ఆఫీసులోనూ బయటా తన మగస్నేహితు లెవరూ ఆమెని జయించలేకపోయారు. కిశోరీ అనేకసార్లు అడిగింది. ఎవర్నైనా ప్రేమించి తేరుకుంటున్నావా అని. లేదంది దుర్గ. కిశోరి ఆమె స్నేహితురాళ్లూ పబ్స్‌కి వెళ్లడం, ఇష్టపడితే మరో అడుగు ముందుకెళ్లడం కొత్తేం కాదు. ఇద్దరూ కాపరం పెట్టిం తరవాత ఒకసారి కిశోరి లోనావాలా వెళ్లింది. మర్నాడు వచ్చి ఇలాగే భోజనం చేసి అంది.

"దుర్గా నే నెక్కడికి వెళ్లానో తెలుసా?"

"లోనావాలా"

"అదేలే. కానీ ఒంటిగా వెళ్లలేదు. ఒకతనితో వెళ్లేను. ఇట్ వాజ్ వెరీ నైస్". ఎవరని అడిగింది. చెప్పిందామె.

"ఈ ఎఫైర్స్ నీకు నచ్చవు గదా?"

"నచ్చడం కాదు. ఇష్టం లేదు. నన్ను ఆఫీసులో ఇంకా అడుగుతూనే ఉంటారు. ఒకసారి దరిదాపు సరే అన్నాను. ఈ అయిదేళ్లలో నా అభిప్రాయాలన్నీ గాలికి కొట్టుకుపోయాయి. కొత్త నమ్మకాలు ఏర్పడలేదు"

"సరే, నీ కన్యత్వం ఎన్నాళ్లు కాపాడుకుంటావు?"

"తెలీదు. నే కాపాడ్డం లేదు. బస్ రెహనే దియా."

"నే మగాణ్నయితే బాగుండేది"

"ఇద్దరం కలిసి ఉండేవాళ్లం కాదు"

"ఏం! అనిత ఉండడంలే?"

"నువ్వసలు పెళ్లి చేసుకోవా?"

"చేసుకుంటా. ఇప్పుడు కాదు. నన్ను భరించేవాడు దొరికినపుడు. ఇంట్లో కూచుని రోటీలు చేసే బాపతు కాదు నేను. ప్రేమ పెళ్లి కాదు గానీ కాలిక్యులేటెడ్ పెళ్లి. నువ్వు?"

"తెలీదు. చేసుకోకూడదనీ లేదు. చేసుకోవాలనీ లేదు."

"వాట్ ఎబౌట్ సెక్స్?"

"నా కన్యత్వం చెడలేదని సర్టిఫై చేశావుగదా. చూద్దాం."

"నా సహాయం కావాలా?"

పెద్దగా నవ్వింది దుర్గ.

"అవసరంఅయితే ఇంకెవర్ని అడుగుతాను. ఇవన్నీ అనుకోకుండా జరుగుతాయనుకుంటాను."

ఆ తరవాతే ఇద్దరికీ ఆత్మీయత పెరిగిందనుకుంది కిశోరి. నాలుగైదుసార్లు పెద్ద హోటళ్లలో తన స్నేహితులకి పరిచయం చేసిందామె. కాఫీలు ఐస్‌క్రీమ్‌లు సేవించి కబుర్లు చెప్పుకునేవారు. ఒక్కోసారి దుర్గ ఒక్కతే వెనక్కి వచ్చేది. మర్నాడు తన అనుభవాల్ని వివరంగా చెప్తూండేది కిశోరి. నిద్దట్లోనే అటుతిరిగింది దుర్గ. ఈసారి ఎలాగైనా దుర్గని

ఒప్పించాలి. పైగా అయ్యర్ మంచివాడు. నాగరీక మర్యాదలు తెలిసినవాడు. పెళ్లిదాకా వెళ్లినా ఆశ్చర్యం లేదు. దుర్గకి ఎలా చెప్పాలి అని ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయింది కిశోరి. పొద్దుగూకుతుండగా దరిదాపు ఒకేసారి ఇద్దరికీ మెళకువ వచ్చింది. టీ చేసింది కిశోరి. తాగుతూ సెల్‌లో ఇంటికి డయల్ చేసింది.వాళ్లక్కయ్యకి అరగంట క్రితం పురుడొచ్చింది. మళ్లీ మగపిల్లాడే.

"వస్తాను. ఎవరి పోలిక? వాళ్ల నాన్న చట్టి ముక్కు వచ్చిందా? ఆ. త్వరలో వస్తా." మరో నిముషం మాట్లాడి పెట్టేసింది కిశోరి.

"అక్కకి మళ్లీ కొడుకు పుట్టేడు."

"అర్ధమైంది."

"అదృష్టవంతురాలు. లేకపోతే మా బావగాడు సణిగేవాడు."

"ఏం, మొదటిసారి మొగపిల్లాడేగా?"

"పధ్నాలుగోసారి అయినా మగపిల్లాడే కావాలి. పోన్లే. ఇంక దానికి ఆపరేషనుచేయించి ఉంటాడు. గొడవ వదిలి పోతుంది."

"మీ బావగాడు మంచివాడేనా?"

కిశోరీ ఒక్క క్షణం మాట్లాడలేదు.

"చెడ్డవాడు కాదు.అక్కని బాగా చూసుకుంటాడు. మరీ పిసినారికాదు. మంచి ఇల్లు కట్టేడు. సుగర్ ఫేక్టరీ వాళ్లు లంచాలు బాగా ఇస్తారు. సినిమాలకి అక్క అడిగితే తీసుకెళ్తాడు. తనకి తను వెళ్లడు. ఒక్క చెడ్డ అలవాటు లేదు. ఎప్పుడూ షేర్ల గురించి ఆలోచిస్తూంటాడు. వాళ్ల బాస్‌కి ఇతనంటే నమ్మకం. డబ్బులు ఇతని ద్వారానే అందుతాయి. ఎప్పుడూ ఓటు వెయ్యడు. అక్కని వెయ్య నివ్వడు."

"నీతో బాగుంటాడా?"

"ఊ. మా అక్క చందూగాణ్ని కడుపుతో వున్నప్పుడు ఒకసారి అతను ఒచ్చినపుడు నేనూ అక్కడే ఉన్నాను. ఓ రోజు టీ చేస్తుంటే వెనకనుంచి వచ్చి మెడమీద ముద్దుపెట్టుకున్నాడు. హి డజంట్ నో హౌ టు కిస్. నవ్వి ఊరుకున్నాను. ముందు కెళ్లబోయ్యాడు. ఒక్క చూపు చూశాను. మళ్లీ నా జోలికి రాలేదు. మూడున్నర నిముషాల తరవాత అతనితో ఏం మాటలూ సాగవు."

"నిజవే. ఐ అండర్‌స్టాండ్."

"పెళ్లి గొప్పరిస్కు. పోనీ గానీ, దుర్గా నీకు అయ్యర్ గుర్తున్నాడా?"

"వాడెవడు?"

"బెంగుళూరు."

"ఆ. యస్ ఐ రిమెంబర్ హిమ్."

"వాడిది కంచి. యూ నో సమ్‌థింగ్? కంచి పట్టు చేరలూ,చేనేత పరిశ్రమా వాటి గురించి దరిదాపు మూడు గంటలు మాట్లాడేడు. ఎంత బావుందో చెప్పలేను. ఎంత స్టడీ చేసి ఉండాలి?"

"నిజవే. పైగా అతని వృత్తికీ దీనికీ సంబంధం లేదు."

"చిన్నప్పుడెప్పుడో కంచి స్కూల్లో చదివేట్ట. అతను కంచి వదిలేడుగానీ. అతన్ని కంచి వదల్లేదు. చేనేత పరిశ్రమ గురించి కూడా అతనికి తెలీంది లేదు."

"సినిమా పిచ్చి కూడా ఉందనుకుంటాను."

"ఉంది. నీకు బాగానే గుర్తుంది. గాడ్‌ఫాదర్ సినిమా ఎలా చూడాలో చెప్పేడు మనకి. అవునా! చివరికి బేక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడాస్టడీ చేస్తాడు"

"అతని కంత టైమెక్కడుంటుంది?"

"నేనూ అదే అడిగేను. మనకి నిజంగా ఇష్టమైన పని చెయ్యడానికి టైము ఎప్పుడూ దొరుకుతుందంటాడు."

"అదీ నిజవే. ఇంతకీ అయ్యరే ఎందుకు గుర్తొచ్చాడు?"

"గుర్తు రాలే. నిన్నట్నించీ బుర్రలోనే ఉన్నాడు."

"వచ్చేడా?"

"వచ్చేడు. వెళ్లేడు. ఫోన్ చేశాడు. ఎల్లుండి దిగుతాడు."

"అచ్చా. ఇంకేం? హేవ్ ఎ టెరిఫిక్ టైమ్."

"యస్. కానీ నాకు కాదు. నీకు."

ఆశ్చర్యంగా చూసింది దుర్గ. సూటిగా స్నేహంగా చూస్తూ చెప్పింది కిశోరి.

"అవును. అతనికి నువ్వంటే ఇష్టం. నీకు అభ్యంతరం లేకపోతే ఆరోజు సాయంకాలం తనకి కేటాయించమని అడిగేడు. అడిగి చూస్తానన్నాను." దుర్గ కళ్లు పెద్దవయ్యేయి. పెదాలు నవ్వుతో విచ్చుకున్నాయి.

"నోనో అదేం లేదు. కంగారు పడకు. నీ సంగతి చెప్పేను. కాస్త బీరుగానీ వైనుగానీ సేవించి గొప్ప భోజనం చెయ్యడం. అంతే."

"షూర్?"

"షూర్. నీతో అబద్ధం చెప్తానా? ఏదేనా జరిగినా నీ ఇష్ట ప్రకారం జరుగుతుంది. అతన్నీ నన్నూ పూర్తిగా నమ్మితేనే వెళ్లు."

"నో ప్రాబ్లమ్. నాకేం అభ్యంతరం లేదు. మరి నువ్వు?"

"నేనుండను. మా కొలీగ్ బర్త్‌డే. అదే ప్రాబ్లం. అతనికి ఫోన్ చేసి చెప్పాను. డన్?"

"డన్"

రాత్రి పడుకోబోయే ముందు మళ్లీ అయ్యర్ గురించి మాట్లాడుకున్నారిద్దరూ. అతను పెళ్లి చేసుకోలేదు. పెళ్లంటే భయం పట్టుకుందిట. అదిపూర్తిగా నిజం కాదని అతనికీ తెలుసు. వివాహానికి సంబంధించిన ప్రాధమిక సమస్య డబ్బు. అతనికా సమస్య లేదు. క్రితంసారి కలిసినపుడు దుర్గే అడిగింది.

"మరి మీ రెప్పుడూ ప్రేమలో పడలేదా?"

పెద్దగా నవ్వేడతను.

"పడ్డాను. ఆర్నెల్లపాటు బాధపడి మర్చిపోయాను."

"అదేం!" అంది కిశోరి.

"ఏం లేదు. ఆమె మా మేనేజరు భార్య."

"మరి ఆమె?"

"ఆమెకేం తెలీదు. స్ట్రిక్ట్‌లీ వన్‌సైడెడ్"

కిశోరి చెప్పింది నిజం. అతను మాట్లాడుతుంటే ఎన్ని గంటలైనా వినడం కష్టం కాదు. మధ్యలో సిగరెట్ కాల్చడానికి దూరంగా వెళ్లిపోతాడు. అతని అలవాటంటాడు. ఆ రోజు కిశోరీ తనూ తనని దించి వెళ్లిపోవడం అసహజం అనిపించలే దామెకి. అయ్యర్ ఆలోచనలతో దుర్గకి చాలాసేపు నిద్ర పట్టలేదు. కలలో అయ్యర్ ఆమెని ఒళ్లో కూచోపెట్టుకుని ముద్దుపెట్టుకున్నాడు. ఆమె కూడా అతన్ని గట్టిగా ముద్దు పెట్టుకుంది.

మర్నాడు మధ్యాహ్నం వరకూ ఆమెకి అయ్యర్ జ్ఞాపకం రాలేదు. ఎంత టైమైందో కూడా తెలీలేదు. మధ్యలో పదిహేను నిముషాలు విశ్రాంతి దొరికి కుర్చీలో వెనక్కివాలి కళ్లు మూసుకుందామె. చటుక్కున అయ్యర్ జ్ఞాపకం ఒచ్చేడు. తీవ్రంగా ఆలోచించిందామె.

"చాలా బావున్నావు ఇవాళ. అయ్యర్ అదృష్టం ఎలా ఉందో." అంది కిశోరి. ఇద్దరూ నవ్వుకున్నారు. సాయంత్రం ఏడవుతూండగా ఇద్దరూ గెస్ట్ హౌస్ కాలింగ్ బెల్ నొక్కేరు. తలుపుతీసి అయ్యర్ ఇద్దర్నీ లోపలికి ఆహ్వానించాడు. రెండు నిముషాల తరవాత వెడతానని లేచింది కిశోరి. డ్రైవర్ని పిలిచి కిశోరికి వాహనం ఏర్పాటు చేశాడు అయ్యర్.

"థాంక్స్ ఫర్ కమింగ్."

నవ్వింది దుర్గ. తెల్లటి పైజమా, నీలం రంగు కాటన్ కుర్తా. బట్టతలకి దారి తీస్తున్న వెనక్కి దువ్వినజుత్తూ, అయ్యర్ ఆకర్షణీయంగానే ఉంటాడు. దుర్గ మామూలుగా లేదు. ఆమెకీ ఆశ్చర్యంగానే ఉంది. మగవాళ్లతో కబుర్లు చెప్పుకోవడం, పబ్‌కి వెళ్లడం ఆమెకి కొత్త కాదు. ఈ అలజడే కొత్తగా వుంది.

"మీ కోసం ప్రత్యేకంగా వైన్ తెప్పించాను. మీరు ఎప్పుడు వెడదాం అంటే అప్పుడు భోజనానికి వెళ్దాం. ప్రస్తుతం మీకు మంచి ఫిష్ చేయించాను."

మెల్లిగా రెడ్‌వైన్ తాగుతూ కబుర్లలో పడిందామె. ముందు ఆమే సినిమాల గురించి ప్రసక్తి తెచ్చింది. అతని కళ్లు మెరిసేయి.

"మీకూ సినిమా పిచ్చి ఉందా?"

"మీ అంత కాదు. మీరు గాడ్‌ఫాదర్ గురించి మాట్లాడ్డం ఇంకా జ్ఞాపకం ఉంది నాకు."

తరవాత అయ్యర్ నాటకాల గురించీ, సినిమా గురించీ మాట్లాడుతూ మధ్యలో అన్నాడు.

"మీకు నాటకాలు ఇష్టవేనా?"

"నేనింతవరకూ ఒక్క నాటకం కూడా చూడలేదు. కిశోరీకి పరిచయం అనుకుంటాను."

"నేను నెల క్రితం లండన్‌లో ఉన్నాను. జాఫ్రీ ఆర్చర్ నాటకం చూశాను. పెద్ద బాగా లేదు."

కంప్యూటర్ తెరమీద గ్రాఫులాగ ఆమె శరీరంలో అలజడి వంకర్లుగా పాకుతోంది. అయ్యర్ అన్నట్టే వైన్ అద్భుతంగా ఉంది. ఎర్రటి వైనులో క్రమంగా అలజడిగ్రాఫు తడిసి కరిగిపోయింది. చేప వేపుడు కూడా రుచిగా ఉంది. ఎంతసేపయిందో తెలీలేదామెకి.

"రెండు నిముషాల్లో సిగరెట్ కాల్చుకుని బట్టలు మార్చుకుని వస్తాను. వియ్ విల్ గో టు డైన్."

అతను లోపలికి వెళ్లిపోయాడు. ఇంతసేపు కూచున్నా గదిని ఆమె సరిగ్గా చూడలేదు. గోడల మీద అందమైన వర్ణ చిత్రాలున్నాయి. లోపలి తలుపు పక్కన గోడకి ఏదో చక్కని శిల్పం వేలాడుతోంది. ఆమెకి హాయిగా అనిపించింది. గోడని ఆనుకుని ఉన్న టేబిలు లైటు పక్కనే రంగుల్లో అమ్మవారి కేలెండరు కనిపించింది. లేచి కేలెండరు దగ్గిరికి వెళ్లి నుంచుందామె. జానపదశైలిలో గీసిన అమ్మవారు.

"చాలా బావుంది గదూ?"

నిశ్శబ్దంగావచ్చి ఆమె వెనక నుంచుని అన్నాడు అయ్యర్.

"ఊఁ. ఎటొచ్చీ మీరో నెల వెనక ఉన్నారు."

అతను చూశాడు. నిజవే. కేలెండరు తీసి ఆమె వెనక ఉన్న టేబిలు మీద పెట్టేడతను. అతని వేపు తిరిగిందామె. అసంకల్పితంగా అతను ఎడమ చెయ్యి మెడమీద వేసి ముందుకు ఒంగి మృదువుగా ఆమె పెదాల మీద ముద్దుపెట్టుకున్నాడు అయ్యర్. ఆమె ఒళ్లు జలదరించింది. అతని వేపు చూసిందామె. అతని మొహం ఎ(ఱ్రబడింది.

"అయామ్ సారీ."

అంటూ అతను వెనక్కి తిరిగేడు. "డ్రైవర్ని రమ్మంటాను." చెయ్యి తీసుకోవడంలో టేబిలు మీద కేలెండరు కింద పడింది. అతను ఫోను వేపు నడిచాడు. ఆమె పెదాలు వేడిగా ఉన్నాయి. కడుపులో రెడ్ వైన్ మరింత ఎ(ఱ్రబడింది.

"క్షణంలో వస్తాడు. నామీద కోపంగా ఉందా?"

లేదని తల అడ్డంగా ఊపిందామె. సోఫా వేపు గది మధ్యకి నడవబోయింది దుర్గ. ఆమె వేసిన రెండో అడుగు అమ్మవారిముఖం మీద పడింది. దుర్గ చటుక్కున ఒంగి కేలెండరు తీసి కళ్లకద్దుకుని, అమ్మవారివేపు ఒకసారి చూసి జాగ్రత్తగా టేబిలు మీద పెట్టింది.

❖ ❖ ❖